VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 09 గురువారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 173

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# కెటిఆర్‌కు హైకోర్టులో మరోమారు చుక్కెదురు

- కెటిఆర్‌కు హైకోర్టులో మరోమారు చుక్కెదురు
- లాయర్‌తో విచారణ కుదరదన్న ధర్మాసనం
- కనుచూపు మేరలో లాయర్ ఉండేలా అనుమతి
- ఎసిబి విచారణకు సహకరించాలని సూచన
- కేటీఆర్ వెంట న్యాయవాది వెళ్లొచ్చు



**సీసీటీవీ పర్యవేక్షణలో కేటీఆర్‌ను విచారించాలని కోర్టు ఆదేశించింది.**

హైదరాబాద్: ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసు విచారణ సమయంలో తన వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టు అనుమతించింది. ప్రశ్నిస్తున్న గదిలోకి మాత్రం ఆయనకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. విచారణను కనిపించేంత దూరం నుంచి గమనించవచ్చంది. విచారణలో న్యాయవాది కేటీఆర్‌కు ఎలాంటి సహకారం అందించరాదని, జోక్యం చేసుకోరాదని తేల్చిచెప్పింది. ఏసీబీ కేసు విషయంలో దర్యాప్తునకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని, న్యాయవాదిని తీసుకెళ్లేందుకు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ బుధవారం దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావు వాదనలు వినిపించారు. దర్యాప్తు అధికారి విచారణ సందర్భంగా న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. దర్యాప్తు అధికారి కేటీఆర్‌ను విచారిస్తుండగా... ఆయన న్యాయవాది చూడటానికి అనువైన ఏర్పాట్లు ఉన్నాయో లేదో చెప్పాలని అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డిని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను 4 గంటలకు వాయిదా

మిగతా 2లో

## మాకేమీ సంబంధం లేదు




హైదరాబాద్: సంచలనం రేపుతున్న ఫార్ములా–ఈ రేసు కేసులో వేర్వేరు దర్యాప్తు సంస్థల ఎదుట హాజరైన నిందితులు ఇద్దరూ తాము ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే నడుచుకున్నామని చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తమ పాత్ర ఏమీలేదని, నిబంధనల ఉల్లంఘన కూడా జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నాటి ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ పూర్వ కమిషనర్ అర్వింద్‌కుమార్‌ను అనిశాబీ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం ప్రశ్నించారు. వారిద్దరి వాంగ్మూలాలు నమోదు చేశారు.


స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ అర్ధాంతరంగా వైదొలగడం దగ్గర నుంచి ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో)కు హడావుడిగా నిధులు బదిలీ చేయడం వరకూ జరిగిన అనేక అంశాలపై అర్వింద్‌కుమార్ నుంచి అనిశా అధికారులు సమాధానాలు రాబట్టారు. ఉదయం 10 గంటల సమయంలో అనిశా కార్యాలయంలోకి వెళ్లిన ఆయనను మధ్యలో భోజన విరామం మినహా సాయంత్రం 4 గంటల వరకూ ప్రశ్నించారు. రేసుల నిర్వహణకు సంబంధించి ప్రతి విషయం మంత్రిత్వశాఖకు తెలుసని ఆయన చెప్పినట్లు సమాచారం. ఏస్‌నెక్స్ట్‌జెన్ ఒప్పందానికి విరుద్ధంగా వైదొలగడంతో ప్రభుత్వం నిధులు చెల్లించాల్సి వచ్చిందని, ఆ సంస్థపై ఎందుకు చర్యలు చేపట్టలేదని అధికారులు అడిగారని సమాచారం. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను ప్రభుత్వానికి సూచించానని ఆయన సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. మంత్రి మండలి ఆమోదం లేకుండా, ఆర్థికశాఖ అనుమతి తీసుకోకుండానే నిధులు ఎలా చెల్లించారని అడగ్గా, మంత్రిమండలి ఆదేశాల ప్రకారమే నిధులు విడుదల చేశామని, రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధం లేదు కాబట్టి ఆర్థికశాఖ అనుమతి తీసుకోలేదని ఆయన వివరించినట్లు సమాచారం. మరో స్పాన్సర్‌ను వెతికేందుకు ప్రయత్నాలు జరిగాయని, సమయాభావం వల్ల వీలుపడలేదని చెప్పినట్లు తెలుస్తోంది. అధికారులుగా తాము సొంత నిర్ణయాలు తీసుకోలేదని, మంత్రిత్వశాఖ చెప్పినట్లే నడుచుకున్నామని, అన్ని విషయాలు ఎప్పటికప్పుడు బాధ్యులకు చెబుతూనే ఉన్నామని అర్వింద్‌కుమార్ స్పష్టం చేసినట్లు సమాచారం.

పైస్థాయిలో తీసుకున్న నిర్ణయాలే

ఈడీ అధికారులకు బీఎల్ఎన్‌రెడ్డి కూడా అర్వింద్‌కుమార్‌లాగే సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఎఫ్‌ఈవోకు నిధుల చెల్లింపునకు సంబంధించి నాడు చీఫ్ ఇంజినీర్ హోదాలో ప్రొసీడింగ్స్ ఇచ్చింది ఆయనే. దాంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం దగ్గర నుంచి నిధుల బదిలీ వరకూ అనేక అంశాలను అధికారులు అడిగినట్లు తెలుస్తోంది. ఉదయం 10 గంటలకు ఈడీ కార్యాలయానికి చేరుకున్న ఆయన రాత్రి 7 గంటల సమయంలో తిరిగి వెళ్లారు. ఎఫ్‌ఈవోకు నిధులు చెల్లించడంలో తన పాత్ర పరిమితమని, పై అధికారులు తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడం తప్ప తన ప్రమేయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. స్పాన్సర్‌షిప్ మొదలు రేసు నిర్వహణకు అయ్యే ఖర్చులు, వాటి చెల్లింపుల వంటివన్నీ పైస్థాయిలో తీసుకున్న నిర్ణయాలేనని, అధికారులు జారీ చేసిన ఆదేశాలను తాను పాటించానని చెప్పినట్లు తెలిసింది.



## మళ్లీ పెరిగిన బంగారం ధరలు




## రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద హెచ్ఎంపీవీపై స్క్రీనింగ్ టెస్టులు

# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా

- భుజంభుజం కలిపి అభివృద్ధి కోసం నడుస్తా
- ప్రజల ఆశలు,ఆశయాల సాధనకు మద్దతు ఇస్తా
- రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- విశాఖపట్టణం బహిరంగ సభలో ప్రధాని మోడీ వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం... 2047 నాటికి రాష్ట్ర ఆర్థికవ్యవస్థను 2.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని పెట్టుకున్న లక్ష్యాన్ని సాకారం చేసేందుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. రాష్ట్రప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్రం భుజం కలిపి నడుస్తుందని భరోసా ఇచ్చారు.



## పండక్కి వెళ్తున్నారా..



చౌటుప్పల్: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఒకసారి తమ వాహనం ఫాస్టాగ్‌ను సరి చూసుకోవాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారు. కేవైసీ చేయించక, మినిమం బ్యాలెన్స్ లేక బ్లాక్‌లిస్టులో పడిపోతున్నాయని చెబుతున్నారు. అసలే సంక్రాంతి సమయంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ సాధారణ రోజుల్లో కంటే ఎక్కువగా ఉంటుంది. వాహనాలు టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరుతాయి. ‘మీ వాహనం ఫాస్టాగ్ ఖాతాలో నగదు లేకపోయినా, బ్లాక్‌లిస్టులో పడినా.. టోల్‌ప్లాజా నుంచి ముందుకు కదల్లేరు.. అలాగని వెనక్కి వెళ్లలేరు. దీంతో మీరే కాకుండా తోటి ప్రయాణికులూ ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడతారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా కారు ఫాస్టాగ్‌ను సరి చూసుకొని వెళ్లడం మేల’ని ఎన్‌హెచ్ఏఐ పీడీ నాగేశ్వర్‌రావు తెలిపారు. మరోవైపు ఎలాంటి ప్రమాదం సంభవించినా, ఇతర అత్యవసర సమయాల్లోనూ 1033 నంబరుకు ఫోన్ చేస్తే సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకొని సాయం చేస్తారన్నారు. విజయవాడ హైవేపై పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలున్నాయి. పంతంగి వద్ద రోజూ సగటున 37 వేల వాహనాలు వెళ్తుండగా..

వీటిలో సుమారు 100 వాహనాలు బ్లాక్‌లిస్టులో పడినవే ఉంటున్నాయి. పండగ సమయంలో ఇంకా రెట్టింపు సంఖ్యలో ఇలాంటి వాహనాలు ఉండే అవకాశముంది. కొందరు వాహనదారులు టోల్‌ప్లాజా దగ్గరికి వచ్చాక రీఛార్జ్ చేస్తున్నారు. యాక్టివేషన్ కావడానికి 15 నిమిషాలకుపైగా సమయం పడుతుంది.

# తిరుపతిలో పెనువిషాదం



- తొక్కిసలాటలో ఐదుగురు భక్తుల మృతి
- వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం తోపులాట
- అస్వస్థతతో మరో మహిళ మృతి

**తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఐదుగురు భక్తులు మరణించారు. మరో 48 మంది క్షతగాత్రులు తిరుపతిలోని రుయా, స్విమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.**

తిరుపతి: తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఐదుగురు భక్తులు మరణించారు. మరో 48 మంది క్షతగాత్రులు తిరుపతిలోని రుయా, స్విమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. వీరిని నర్సీపట్నానికి చెందిన బుద్దేటి నాయుడుబాబు (51), విశాఖపట్నానికి చెందిన రజిని (47), లావణ్య (40), శాంతి (34), కర్ణాటకలోని బళ్లారికి చెందిన నిర్మల (50)లుగా గుర్తించారు. అంతకుముందే శ్రీనివాసం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద అస్వస్థతకు గురై తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన మల్లిగ (49) అనే మహిళ మృతి చెందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన



## గౌతం అదానీపై అమెరికాలో విచారణ



అదానీ విచారణ వెనుక ఏదైనా లోగుట్టు ఉన్నాదా అని, దీని వెనుక జార్జ్ సోరస్ లాంటి వ్యక్తి ఉన్నారా అని రిపబ్లికన్ నేత ప్రశ్నించారు.




# కేసులు అసలు సమస్యే కాదు

- ఫార్ములా కేసులో పైసా అవినీతి లేదు
- న్యాయం కోసం సుప్రీంలో నేను కొట్లాడుతా
- రైతు, ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు కొట్లాడాలి
- బిఆర్ఎస్ డైరీ ఆవిష్కరణలో కెటిఆర్ పిలుపు

**దృష్టి మళ్లింపు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక్కసారి రైతు భరోసా ఇచ్చి మళ్లీ ఎగ్గొడతారు.**

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**అమరావతి:** పుత్తడి ధర మరోమారు పెరిగింది..! వరుసగా మూడు రోజులు స్థిరంగా కొనసాగిన బంగారం ధరలు బుధవారం మళ్లీ పెరిగాయి. 2024లో గోల్డ్ రన్ హై స్పీడ్‌లో సాగింది. ఈ 2025లో కూడా అంతకుమించి బంగారం పరుగులు తీస్తుందని వ్యాపారవేత్తలు అంటున్నారు. దేశీయ మార్కెట్లో రూ.90 వేలకు చేరే ఛాన్స్ ఉందంటున్నారు..! ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి పై రూ.100 పెరగగా, 24 క్యారెట్లపై రూ.110 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో బుధవారం (జనవరి 8) 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.72,250గా.. 24 క్యారెట్ల ధర రూ.78,820గా ఉంది. మరోవైపు నిన్న భారీగా పెరిగిన వెండి ధర నేడు స్థిరంగా ఉంది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.92,500గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విశాఖ, విజయవాడలో కిలో వెండి రూ.లక్షగా కొనసాగుతోంది.

## రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద హెచ్‌ఎంపీవీపై స్క్రీనింగ్ టెస్టులు

న్యూఢిల్లీ: దేశంలో హెచ్‌ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్‌ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్టీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్‌ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. హెచ్‌ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

న్యూఢిల్లీ: కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు.

ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

## గౌతం అదానీపై అమెరికాలో విచారణ

న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతం అదానీ, ఆయన కంపెనీలపై విచారణ చేపట్టేందుకు ఇటీవల అమెరికా సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ముడుపులు చెల్లించిన కేసులో అమెరికా కోర్టు అదానీని నిలదీసింది. అయితే భారతీయ వ్యాపారిపై అమెరికా న్యాయశాఖ తీసుకున్న నిర్ణయాన్ని రిపబ్లికన్ నేత తప్పుపట్టారు. ఎంపిక చేసుకుని ఓ వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల.. భాగస్వామ్య దేశాలతో బంధాలు దెబ్బతింటాయని ఆ నేత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ బీ గార్లాండ్‌కు లేఖ రాశారు లాన్స్ గూడెన్. విదేశీ వ్యక్తులను ఎంచుకుని ఎందుకు టార్గెట్ చేస్తున్నారని న్యాయశాఖను డిమాండ్ చేశారాయన. అదానీ విచారణ వెనుక ఏదైనా లోగుట్టు ఉన్నాదా అని, దీని వెనుక జార్జ్ సోరస్ లాంటి వ్యక్తి ఉన్నారా అని రిపబ్లికన్ నేత ప్రశ్నించారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు బలమైన భాగస్వామిగా ఇండియా ఉన్నదని, టార్గెట్ చేసి చర్యలు తీసుకోవడం వల్ల భాగస్వామ్య కూటమి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. దేశంలోని చెడు వ్యక్తులను ముందుగా అమెరికా న్యాయశాఖ శిక్షించాలని, విదేశీ వ్యక్తులను కాదు అని గూడెన్ పేర్కొన్నారు. వందల కోట్ల డాలర్లు పెట్టుబడి పెటి, అమెరికన్ల కోసం లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నవారిని టార్గెట్ చేయడం వల్ల దీర్ఘకాలంలో అమెరికాకే నష్టం జరుగుతుందని గూడెన్ తన లేఖలో తెలిపారు. ఒకవేళ అదానీపై ఆరోపణలు నిజమైనా, వాటిని నిరూపించినా, ఆ అంశంలో అమెరికా పాత్ర ఏముంటుందని గూడెన్ ప్రశ్నించారు. అదానీ సంస్థ భారత్‌లో అక్కడి అధికారులకు లంచాలు ఇచ్చిందని, ఓ భారతీయ కంపెనీ ఆ లావాదేవీలకు పాల్పడిందని, దీంట్లో అమెరికా వ్యక్తుల ప్రమేయం ఏమి ఉందని గూడెన్ తన లేఖలో తెలిపారు. అమెరికా వ్యక్తుల ప్రమేయం లేనప్పుడు.. విదేశీ వ్యక్తులను విచారించేందుకు న్యాయశాఖ ఎందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుందని ఆయన అడిగారు. అదానీ ముడుపుల కేసులో ఏ ఒక్క అమెరికా వ్యక్తి లేకపోవడం ఏంటని న్యాయశాఖను ప్రశ్నించారు.

ఇండియాలో అవినీతి జరిగితే, అదానీపై అమెరికాలో కేసు ఎందుకు రిజిస్టర్ చేసినట్లు న్యాయశాఖను నిలదీశారు. మీరేమైనా ఇండియాలో న్యాయం కోసం వత్తిడి తెస్తున్నారా అని అడిగారు. ఈ కేసులో నిమగ్నమైన భారతీయ అధికారులను అమెరికాకు రప్పిస్తారా అని ప్రశ్నించారు. ఒకవేళ అవినీతి అధికారుల్ని అప్పగించేందుకు భారత్ నిరాకరిస్తే, అప్పుడు అమెరికా న్యాయశాఖ వద్ద ఉన్న ఆప్షన్ ఏంటని అడిగారు. అమెరికా, భారత్ మధ్య చిచ్చు పెట్టి, బైడెన్ సర్కారు అదానీ కేసును అంతర్జాతీయం చేయాలని చూస్తున్నదా అని రిపబ్లికన్ నేత గూడెన్ ప్రశ్నించారు.


# కేసులు అసలు సమస్యే కాదు



**హైదరాబాద్:** కేసులు అసలు సమస్యే కాదు. రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలి. ఈ కేసుపై నేను పోరాడతాను. భారాస నేతలు కేసు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను తప్పు చేయలేదు.. ఎవరికీ భయపడను' అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో భారాస డైరీని ఆ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరయ్యారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. ఫార్ములా ఈరేసు కేసు గురించి నేను చూసుకుంటాను. ఏసీబీ కేసు పెద్ద విషయం కాదు. నా కేసుల గురించి ఆందోళన, ఇబ్బంది లేదు' అని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు నియమిస్తామన్నారు. ఈఏడాది పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాల్లోనే పార్టీ క్యాడర్‌కు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతన్నకు జరుగుతోన్న మోసాన్ని ప్రజలకు వివరించాలని.. మొత్తంగా 30 శాతం రుణమాఫీ మాత్రమే జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన నాడు ఉన్న ఇబ్బందులతో పోల్చితే ఇప్పుడు ఉన్నవి పెద్దవి కాదు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ బిడ్డగా, ఆయన తయారు చేసిన సైనికుడిగా నేను ఎంతో ధైర్యంగా ఉంటా. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తున్నట్లు దిల్లీ కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. ఆనాడు డైరీ ఆవిష్కరణలు ఉద్యమ కేంద్రాలుగా ఉండేవని... నేటి డైరీ ఆవిష్కరణ తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి సంవత్సర కాలంగా చేసింది ఎగవేతలు, కేసులే అని వ్యాఖ్యలు చేశారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. డైవర్షన్‌లు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమిలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచిందన్నారు. ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళ మీద కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు

. రేవంత్ రెడ్డి భూములకు ఆరులైన్ల రోడ్లు వేసుకుంటున్నారని.. అప్పులపై అసెంబ్లీలోనే ప్రభుత్వం నోరు మూయిం చామన్నారు. లగచర్ల రైతులకు అండగా కేటీఆర్ నిలబడ్డారని.. కేటీఆర్ ఉద్యమకా రుడు, కార్యకర్త అని తెలిపారు. ఆయనకు ఆపద వస్తే పార్టీ అంతా అండగా ఉండాలని కోరారు. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. దృష్టి మళ్లింపు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక్కసారి రైతు భరోసా ఇచ్చి మళ్లీ ఎగ్గొడతారు. దిల్లీకి కమీషన్లు పంపేందుకు డబ్బులు ఉన్నాయి కానీ... పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్నారు. ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు అన్నారు.

# కెటిఆర్‌కు హైకోర్టులో మరోమారు చుక్కెదురు



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఎసిబి విచారణలో లాయర్‌ను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే లాయర్ కనుచూపు మేరలో ఉండేలా మాత్రం హైకోర్టు అనుమతించింది. కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం మధ్యాహ్నం 4 గంటలకు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫార్ములా–ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసు విచారణలో తనతోపాటు న్యాయవాది ఉండాలంటూ కేటీఆర్ కోరడాన్ని కోర్టు ఆక్షేపించింది. కేటీఆర్‌తోపాటు లాయర్ ఉండేందుకు హైకోర్టు నిరాకరించింది. విచారణ సమయంలో లాయర్‌తో కలిసి కూర్చునే అవకాశం లేదని తేల్చి చెప్పింది. సీసీ టీవీ పర్యవేక్షణ లేదా కేటీఆర్ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేందుకు అనుమతి ఇచ్చింది. ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నప్పుడు న్యాయవాది రాంచందర్‌రావు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేందుకు హైకోర్టు అంగీకరించింది. నేరుగా కేటీఆర్ పక్కన విచారణలో పాల్గొనేందుకు నిరాకరించింది. రేపు ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణపై అభ్యంతరాలు ఉంటే మళ్లీ కోర్టుకు రావొచ్చని తెలిపింది. విచారణ సందర్భంగా న్యాయమూర్తికి కేటీఆర్ వెంట వెళ్లే లాయర్ పేరును న్యాయవాది ప్రభాకర్ రావు తెలిపారు. కేటీఆర్ వెంట మాజీ అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు వెళ్తారని న్యాయమూర్తికి తెలిపారు. కేటీఆర్‌కు కనిపించే దూరంలో న్యాయవాది ఉంటారని జడ్జి చెప్పారు. కేటీఆర్‌ను ఒక గదిలో, లాయర్‌ను ఒక గదిలో కూర్చోబెట్టి.. విచారణ కనిపించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు ఏఏజీకి సూచించింది. లైబ్రరీ విండో నుంచి కేటీఆర్ విచారణను చూడొచ్చని ఏఏజీ కోర్టుకు తెలిపారు. ఇక కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇందుకు హైకోర్టు నిరాకరించింది. సీసీటీవీ పర్యవేక్షణలో కేటీఆర్‌ను విచారించాలని కోర్టు ఆదేశించింది.

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు

**విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు పడిందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత ఎపిలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అయితే గత ఐదేళ్ల విధ్వంస పాలనతో ఎపి ఎంతగానో నష్టపోయిందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. విశాఖలో ప్రధాని సమక్షంలో అనేక కార్యక్రమాలకు శంకుస్థాపన జరిగిన సందర్భంగా జరిగిన సభలో సిఎంచంద్రబాబు మాట్లాడారు. ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు ప్రధాని మోదీ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'ఏపీలో ఎన్డీఏ కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించింది. భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్ కొనసాగుతుంది, దేశ రాజకీయాల్లో మోదీ ప్రధానిగా ఉంటారు. దిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుంది.. రాసి పెట్టుకోండి. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోదీ కృషి చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన.. మోదీ నినాదాలు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి తెచ్చారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా ఉందో.. ఏపీకి విశాఖ అలాంటి ఆర్థిక నగరం' అని చంద్రబాబు వివరించారు. 'మోదీని స్ఫూర్తిగా తీసుకొని నిత్యం ముందుకెళ్తాం. త్వరలో అమరావతికి రావాలని ప్రధానిని కోరుతున్నా. నదుల అనుసంధానం మా లక్ష్యం.. అందుకు కేంద్రం సాయం కావాలి. మోదీ కార్యక్రమాల వల్ల దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి లేదా రెండో స్థానంలో ఉంటాం. రాష్ట్ర విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కేంద్రం సాయంతో నిలదొక్కుకున్నాం.. ముందుకెళ్తున్నాం. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసే బాధ్యత మాది. కేంద్రం అండతో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయి. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి.. కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత మాది. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక ప్రాంతాలుగా మారుతున్నాయి. అరకు కాఫీని మోదీ బాగా ప్రచారం చేస్తున్నారు. ఏ సమస్య చెప్పినా ఆయన వెంటనే అర్థం చేసుకుంటారు. వెంటనే పనులు జరిగేలా చొరవ చూపిస్తారు. గతంలో ఏ ప్రధాని కూడా ఇంతలా చొరవ చూపలేదు. మన దేశానికి సరైన సమయంలో సరైన ప్రధాని ఉన్నారు' అని చంద్రబాబు కొనియాడారు. అంతకుముందు ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన రోడ్ షో అదిరిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ఎక్కడ లేని ఉత్సాహం వస్తోందని చంద్రబాబు తెలిపారు. విశాఖ సభకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరున నమస్కారాలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడికెళ్లినా ప్రధాన మంత్రిపై ప్రజలు నమ్మకం చూపిస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ

ప్రజలకు మోదీపై నమ్మకం, విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి చేతులమీదుగా రూ.2.08,545 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి సంఘటన తన జీవితంలో, ఆంధ్రరాష్ట్ర చరిత్రలో మొట్టమెదటిసారిగా జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..' విశాఖ రైల్వేజోన్ కల సాకారమైంది. రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాం. ఏడు రైల్వే ప్రాజెక్టులకు సైతం శంకుస్థాపనలు చేసుకున్నాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వస్తోంది. పూడిమడక దగ్గర ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ పార్క్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. ఏపీ చరిత్రలోనే ఇది నిలిచిపోయే రోజు. భవిష్యత్‌లోనూ మా కూటమి కొనసాగుతుంది. ఢిల్లీలో గెలవబోయేది ఎన్డీఏనే. మేమంతా మోదీతోనే ఉంటాం. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. ప్రజలకు దగ్గరైన వ్యక్తి మోదీ. మా కాంబినేషన్ ఎప్పటికీ ఉంటుంది. ప్రధానిగా మోదీ ఉంటారు. ప్రపంచం మెచ్చే నాయకుడు మోదీ. దేశం

కోసం పనిచేసే నాయకుడు మోదీ' అని చెప్పారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, టీజీ భరత్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా



**విశాఖపట్నం:** ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని మోదీ అన్నారు ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయి. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మా లక్ష్యం. దేశంలో 2 గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. దానిలో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు.

'నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశాం. కేవలం 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి పార్కులు వస్తున్నాయి. చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వేస్టేషన్లు ఆధునికీకరణ చేపట్టాం' అని ప్రధాని మోడీ వివరించారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ క్రమంలో నేడు విశాఖపట్నంలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మాట్లాడిన ప్రధాని తన అభిమానాన్ని చూపించే అవకాశం ఇప్పుడు వచ్చిందని పేర్కొన్నారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ.. ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. చంద్రబాబు స్పీచ్‌తో సిక్సర్ కొట్టారని పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోదీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చంద్రబాబు లక్ష్యాలకు మేం ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధాని అన్నారు. ఏపీ ప్రజల ఆశలు, ఆశయాలకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఏపీకి అన్ని రంగాల్లో



మద్దతుగా నిలుస్తున్నామని, ఏపీతో భుజం భుజం కలిపి నడుస్తామని మోదీ పేర్కొన్నారు. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని ప్రధాని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయని

ప్రధాని మోదీ అన్నారు. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే మా లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలా కాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్ అని మరోసారి గుర్తు చేశారు ప్రధాని మోదీ.

'దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. అందులో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశాం. 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా

రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వేజోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందు కుంటాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోడీ అంతకుముందు విశాఖలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దీనికి భారీగా జనం హాజరై మోడీకి అభివాదం తెలిపారు. బహిరంగ సభలో ప్రధాన ప్రసంగాన్ని తెలుగులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అనువాదం చేసి అందించారు.


వేగుచుక్క

# హ్యాట్రిక్ విజయం కోసం ఆప్ కృషి

**ఆప్‌కు మద్దతు పలికిన మమతా బెనర్జీ**

**ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన కేజ్రీవాల్**





**న్యూఢిల్లీ:** దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ. మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) కేజ్రీవాల్‌కు మద్దతు ప్రకటించాయి. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆప్.. ఆ తర్వాత జరిగిన హరియాణా ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేసిన విషయం తెలిసిందే. దిల్లీలో మత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2015లో 67 స్థానాలు గెలుచుకొని తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆప్.. ఆ తర్వాత 2020లో 62 సీట్లతో అధికారం నిలబెట్టుకుని ఇప్పుడు హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేస్తోంది.

## షరతులు లేనీ బీడి జీవనభృతి కోసం ధర్నా.




**వేగుచుక్క, న్యూస్, నిర్మల్, జనవరి 8:**

బీడి కార్మికులకు 2014 కటాఫ్ ఎత్తివేసి, షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలని బిఎల్ టియు డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుళ జన బీడి కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రాములు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి రూ" 4016 కు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎలాంటి ఆంక్షలు లేకుండా పరిశ్రమలోని అందరికీ జీవన భృతి మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, బీడి కార్మికులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు.







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 8:**

జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా నగరంలోని మాణిక్ భవన్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు సంబంధించి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి. కిరణ్ కుమార్ బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ట్రాఫిక్ నిబంధనలను పాటించి వ్యక్తిగతంగా, ప్రాణాలను కాపాడుకుంటూ కుటుంబానికి దేశానికి బలం చేకూర్చాలని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులందరూ వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. వాహనదారులందరూ హెల్మెట్ ను తప్పకుండా ధరించాలని తద్వారా ప్రమాదాల నివారణను చేపట్టి ప్రాణ నష్టాన్ని అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటిఓ ఉమా మహేశ్వర్, ట్రాఫిక్ సిఐ ప్రసాద్, పాఠశాల అధ్యక్షులు దన్ పాల్ శ్రీనివాస్, సెక్రటరీ ఇంగు ప్రసాద్, సత్య ప్రసాద్ , కటకం సతీష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య, ప్రిన్సిపాల్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా వద్ద జాతీయ భద్రత మాసోత్సవాలు.




**వేగుచుక్క న్యూస్:**

జాతీయ భద్రత మాసోత్సవాలు సందర్భంగా నేషనల్ హైవే 44 పై పై ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద వాహనాలకు రేడియం రిఫ్లెక్టివ్ టైప్స్ అతికించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర రావు, ఆర్మూర్ ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వివేకానంద రెడ్డి, సాలురా మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, శిక్షణలో ఉన్న మోటార్ వాహన తనిఖీ అధికారులు, ఐరాడ్ మేనేజర్, టోల్గేట్ మేనేజర్ అనిల్, సేఫ్టీ అధికారులు వీరబాబు గారు టోల్గేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## 20 కుక్కలను కిరాతకంగా చంపేశారు..!

సంగారెడ్డి జిల్లాలో సుమారు 31 కుక్కలపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనం. ఈ దాడిలో 20 కుక్కలు ప్రాణాలు వదలగా.. 11 శునకాలుకు తీవ్ర గాయాలయ్యాయి.


రోజు రోజుకు మనుషుల్లో మానవత్వం మాయమైపోతోంది. కోపావేశాలు, నేరపూరిత ఆలోచనలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వాటన్నింటి కంటే ఎక్కువగా సైకోయిజం అధికమైపోతోంది. ప్రస్తుతం సమాజంలో వెలుగుచూస్తున్న ఘటనలే దానికి నిదర్శనం. అయితే.. సాటి మనుషులపైనే కాదు.. మూగజీవాల మీద కూడా అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తూ మనుషులు తమ సైకోయిజాన్ని నిరూపించుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఓ అత్యంత పాశవిక, క్రూరమైన ఘటన ఇప్పుడు సర్వత్రా ఆందోళన, ఆవేదన కలిగిస్తోంది.

కంది మండలం ఎద్దు మైలారం గ్రామ శివారులో ఉన్న ఓ బ్రిడ్జి కింద 20 కుక్కలను అత్యంత కిరాతకంగా చంపేశారు కొందరు దుండగులు. సుమారు 30 నుంచి 35 కుక్కల మూతులు కుట్టేసి, కాళ్లు కట్టేసి.. 40 అడుగుల పైనుంచి కిందకు పడేసి.. వాటి ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించారు. అయితే.. ఇందులో 20 కుక్కలు చనిపోగా.. మరో 11 కుక్కల పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన కుక్కలను సికింద్రాబాద్ తార్నాక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే.. కొంతమంది ఈ విషయాన్ని సిటిజన్స్ ఫర్ యానిమల్స్ వారికి సమాచారం ఇవ్వడంతో వెలుగులోకి వచ్చింది. బ్రిడ్జి కింద పడి ఉన్న కుక్కల శవాలు, వాటి పక్కనే మూలుగుతున్న మరికొన్ని శునకాలను.. చూసిన కొందరు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్రిడ్జి కింద తీవ్రంగా గాయపడిన కుక్కలను చూసి.. వంతెన పైనుంచి విసిరేసి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు.

# నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యం.

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 8:**



అర్బన్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల పైన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా బుధవారం సమావేశం అయ్యారు. నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మరమ్మతులకు విడుదలైన 1.25 కోట్ల రూపాయలతో వెంటనే పనులు ప్రారంభించి అర్హులైన లబ్ధిదారుల జాబితా కొత్తగా ఎంపిక చేసి వారికి ఇండ్లను కేటాయించాలని సూచించడం జరిగింది. నగర ప్రజా ఆరోగ్యం, అవసరాలకు అనుగుణంగా నిర్మించిన అహ్మది బజారు, ఖలీల్ వాడిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల పనులు అతి త్వరలో పూర్తి చేసి ప్రజాపయోగంలోకి తీసుకొచ్చే విదంగా చర్యలు తీసుకోవాల న్నారు. టియూ ఎఫ్ఐడిసి ఫండ్ కింద నియోజకవర్గనికి విడుదల అయిన 60 కోట్ల రూపాయలకు టెండరింగ్ పిలిచి త్వరతగతిన డివిజన్ల వారిగా పనులు ప్రారంభించాలని కోరడం జరిగింది. నగరంలో కబ్జాలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు ఇబ్బందులకు గురి అవుతున్నారని కబ్జాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫుట్ పాత్ కబ్జాలు, రోడ్లపై విచ్చలవిడిగా వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు, తోపుడు బండ్లతో రోడ్ల పై వ్యాపారం చేస్తున్న వారికీ ప్రత్యేకంగా ఒక స్థలం కేటాయించాలని సూచించారు. స్మార్ట్ సిటీ కోసం కేంద్ర నాయకత్వంతో ఎంపీ గారితో కలిసి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు స్మార్ట్ సిటీ విధివిధానాలకు అనుగుణంగా ఇందూర్ నగరాన్ని తీర్చిదిద్దే బాధ్యత అందరిపైన ఉందని అందుకు ప్రజలందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్ అండ్ బి ఈ ఈ సురేష్ , డి ఈ ప్రవీణ్ , మున్సిపల్ ఈ ఈ మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా నిలుస్తున్న "వేగుచుక్క" పత్రిక.




**అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త.**

**ఘనంగా క్యాలెండర్ ఆవిష్కరణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 8**

: నిజాలను నిర్భయంగా రాస్తూ, ప్రజల గొంతుకగా "వేగుచుక్క" డిజిటల్ పత్రిక నిలుస్తున్నదని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వేగుచుక్క న్యూస్ 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డిజిటల్ దినపత్రిక లు అనేక ప్రజా సమస్యలను బహిరంగ పరుస్తూ, పరిష్కారానికి ఎంతగానో కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రలోభాలకు లొంగకుండా, ఆదర్శ భావాలతో ప్రజల సమస్యలే ఎంజెండా గా వార్తలు రాస్తున్న వేగుచుక్క డిజిటల్ దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి బైర శేఖర్, చట్టం ఎడిటర్ సిరిగాద ప్రసాద్, వేగుచుక్క ప్రతినిధి కుంచం వెంకటేష్, జర్నలిస్ట్ లు సంజీవరెడ్డి, నంద్యాల శ్రీను తదితరలు పాల్గొన్నారు.

# చర్లపల్లి కొత్త రైల్వే టెర్మినల్..

హైదరాబాద్ నగరంలో కొత్తగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి రెగ్యులర్ ట్రైన్ల రాకపోకలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. సాంకేతిక కారణాలతో పాటుగా మరికొన్ని సమస్యలతో ట్రైన్ల రాకపోకలకు మరో మూడు నెలల సమయం పట్టొచ్చునని అధికారులు తెలిపారు.


హైదరాబాద్ నగరంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా చర్లపల్లి రైల్వే టెర్మినల్ ఇటీవల అందుబాటులోకి వచ్చింది. జనవరి 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ టెర్మినల్‌ను ప్రారంభించారు. రూ.413 కోట్ల వ్యయంతో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. అత్యాధునిక సౌకర్యాలతో ఈ టెర్మినల్ నిర్మించారు. ఎయిర్‌పోర్టు తరహాలో నిర్మించిన ఈ రైల్వే టెర్మినల్‌లో ప్రయాణికుల కోసం అనేక సౌకర్యాలు కల్పించారు. స్టేషన్‌లో మొత్తం 19 ట్రాక్స్ ఉండగా.. 9 ప్లాట్ ఫాంలు ఏర్పాటు చేశారు. 5 లిఫ్టులు, 5 ఎస్కలేటర్లను ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు.

అయితే ఈ స్టేషన్ పూర్తి స్థాయిలో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చేందుకు మరికొంత సమయం పట్టే ఛాన్స్ ఉందని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. రెగ్యులర్ రైళ్లలో రాకపోకలు సాగించేందుకు మరో మూడు నెలల ఆగాల్సిందేనని అంటున్నారు. టెక్నికల్ కారణాల వల్ల చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రస్తుతానికి స్పెషల్ ట్రైన్లనే నడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల పరిధిలో వివిధ ట్రైన్లలో ముందుస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులను ఆయా టెర్మినల్స్ వరకు మరికొన్నాళ్లు తప్పక కొనసాగించాల్సి ఉందని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో చర్లపల్లి నుంచి రెగ్యులర్ ట్రైన్ల రాకపోకలకు మరికొంత సమయం పట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు.

ఇదే కాకుండా చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అప్రోచ్ రోడ్లు విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. దీంతో ఆయా రోడ్ల నిర్మాణానికి సమయం పట్టే ఛాన్స్ ఉంది. నిర్వహణ పనుల కారణంగా జనవరి నెలాఖరు వరకు కొన్ని ట్రైన్లకు పూర్తిగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. మరికొన్ని రైలు సర్వీసుల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు చెప్పారు.

వేగుచుక్క

# రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ..




తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చక చకా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఉత్తర భాగం నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ షురూ చేయగా.. ఇప్పుడు భూసేకరణ కూడా మొదలుపెట్టేసింది. మొదలుపెట్టటమే కాదు వేగం పెచ్చింది కూడా. అయితే.. భూసేకరణలో చాలా మంది రైతులు భూములు ఇస్తుండగా.. కొన్ని ప్రాంతాల్లో మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అలాంటి రైతులను ఒప్పించి వారి భూములకు మంచి పరిహారం చెల్లించి మెప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

తెలంగాణలో గేమ్ ఛేంజర్ అవుతుందని భావిస్తోన్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే.. మొదటగా నిర్మించదలచిన రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియలోనూ స్పీడు పెంచారు అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో యాదాద్రి జిల్లా అధికారులు.. భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే తుర్కపల్లి పరిధిలో రెండు గ్రామాల రైతులతో మాట్లాడారు. మెరుగైన పరిహారం ఇస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆ రెండు గ్రామాల రైతులు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఇక.. మిగిలిన గ్రామాల రైతులతోనూ అధికారులు చర్చలు జరపనున్నారు.

అయితే.. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంలో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం 164 కిలో మీటర్లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 5 మండలాల్లోని 24 గ్రామాల్లో 59 కిలో మీటర్ల నిర్మాణానికి 1800 ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాల్లోని రైతులు భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు.

అనాసక్తిగా ఉన్న రైతులకు మంచి పరిహారం ఇచ్చి ఒప్పించి మెప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. అధికారులు గ్రామాల బాట పట్టారు. రైతులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్హనుమంత రావు క్షేత్రస్థాయికి వెళ్లి బాధిత



రైతులతో నేరుగా మాట్లాడుతున్నారు. ముందుగా తుర్కపల్లి మండలంలోనే రీజినల్ రింగ్ రోడ్డు ప్రారంభమవుతుండగా అక్కడి రైతులతో చర్చించారు.

భువనగిరి మండలంలో196 ఎకరాలను సేకరించాల్సి ఉండగా.. రాయగిరి గ్రామంలోని 105 ఎకరాలకు చెందిన రైతులు భూమి ఇచ్చేందుకు వ్యతిరేకిస్తున్నారు. సర్వే నంబర్ 215తో పాటు పలు సర్వే నంబర్లలో ఎకరానికి రూ.13.12 లక్షలు, సర్వే నంబర్ 379తో పాటు మిగతా నంబర్లలో రూ.29.40 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో.. సర్వే నంబర్ 682 తో పాటు పలు నంబర్లలో రూ.36.75 లక్షల వరకు రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ఉండగా.. బహిరంగ మార్కెట్ ఎకరానికి కోట్లలో పలుకుతోంది. అయితే.. రిజిస్ట్రేషన్వ్యాల్యూను బట్టి రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలకు పైగా గ్రామానికి చెందిన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తుండగా.. ఆమేరకు ప్రపోజల్స్ రెడీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

మరోవైపు.. తుర్కపల్లి మండలం కోనాపురం, ఇబ్రహీంపూర్లో 38 ఎకరాలకు చెందిన రైతులను కలెక్టర్తో పాటు అడిషనల్ కలెక్టర్ కలిసి మాట్లాడారు. బహిరంగ మార్కెట్లో ఎకరానికి కోటి రూపాయల డిమాండ్ ఉందని.. తమకు కనీసం రూ.50 లక్షలైనా ఇవ్వాలని రైతులు కోరారు. అయితే.. నేషనల్ హైవే రూల్స్ ప్రకారం ఇక్కడ రిజిస్ట్రేషన్వ్యాల్యూకు మూడు రెట్లు మాత్రమే పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. ఇలా చూస్తే ఎకరానికి రూ.19 లక్షలే వస్తుందని అధికారులు వివరించారు. అయినప్పటికీ.. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు చెప్పిన మాటలకు.. రైతులు సానుకూలత వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. మిగిలిన 22 గ్రామాల రైతులతోనూ మాట్లాడి.. అందరిని ఒప్పిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.



# కింగ్ ఫిషర్ బీర్లు బంద్..!

తెలంగాణలోని మందుబాబులకు కిక్కు దిగిపోయే వార్త. ఇప్పటి నుంచి రాష్ట్రంలో కింగ్ ఫిషర్ బీర్లు బంద్. ఈ ముచ్చట సర్కారోళ్లు చెప్తలేదు. ఆ కింగ్ ఫిషర్ బీర్లు తయారు చేసి సరఫరా చేసే యునైటెడ్ బ్రూవరీసోళ్లు తెగేసి చెప్తున్నారు. దానికి కారణం.. టీజీబీసీఎల్ బకాయిలు చెల్లించకపోవటమేనని బ్రూవరీస్ కంపెనీ సెబీకి రాసిన లేఖలో తెలిపింది. దీంతో.. ఇక నుంచి తెలంగాణకు కింగ్ ఫిషర్ బీర్లు సరఫరా చేయబోమని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం ఇప్పుడు తెలంగాణలోని బీరు ప్రియులకు స్యాడ్ న్యూస్‌గా మారింది.

పండగ ముందు తెలంగాణ మందుబాబులకు బ్యాడ్‌న్యూస్. ఇక నుంచి తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్లు కనిపించవంట. తెలంగాణకు కింగ్ ఫిషర్ బీర్లు, హెనికిన్ బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ ప్రకటించింది. తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ బకాయిలు చెల్లించకపోవడం కారణంగానే బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ తెలిపింది. ఈ మేరకు.. సెబీకి యునైటెడ్ బ్రూవరీస్ లేఖ రాసింది.

తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ రూ.900 కోట్లు బకాయి ఉందని, 2019 నుంచి ధరలను సవరించకపోవడం లాంటి కారణాల వల్ల.. భారీ నష్టాలు వస్తున్నాయని బ్రూవరీస్ తన లేఖలో వెల్లడించింది. బ్రూవరీస్ తీసుకున్న ఈ నిర్ణయంతో సంక్రాంతి పండగ ముందు.. రాష్ట్రంలోని కింగ్ ఫిషర్ బీర్ ప్రియుల నోట్లో వేడి వేడి బీరు పోసినట్టయింది.

తెలంగాణలో మంచి అయినా.. చెడు అయినా.. బాధొచ్చినా సంతోషం వచ్చినా.. పండుగొచ్చినా పబ్బమొచ్చినా.. చచ్చినా బతికినా.. ఇలా ఏ సందర్భమైనా ముందు మందుండాల్సిందే. తెలంగాణలో తాగటం అనేది అలవాటుపడిన ఓ సంప్రదాయమని ఓ సినిమాలో చెప్పినట్టు.. చిన్నా పెద్దా అందరూ తాగుతారన్నది బహిరంగ రహస్యమే. అయితే.. వయసులో పెద్దవాళ్లు చాలా మంది ఎర్రమందు అంటే.. విస్కీ, బ్రాండీ, రమ్ లాంటి మద్యం సేవిస్తే.. యువత మాత్రం ఎక్కువగా తాగేది బీర్లే.. అందులోనూ కింగ్ ఫిషర్ బ్రాండ్ బీర్లకు, మళ్లీ అందులో కింగ్ ఫిషర్ లైట్ బీర్లకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది.

మార్కెట్‌లో ఎన్నో పేర్లతో బీర్లు లభ్యమవుతున్నా.. చాలా మందికి బీర్ అంటే చాలు కింగ్ ఫిషర్ బీరే మొదటగా గుర్తొస్తుంది. కొంత మందికైతే.. కింగ్ ఫిషర్ బీర్ తప్ప మిగతా బ్రాండ్ల పేర్లు కూడా సరిగా తెలియదంటే అతిశయోక్తి కాదు. అలాంటి ప్రజాధరణ పొందిన కింగ్ ఫిషర్ బీర్లు ఇప్పుడు మొత్తానికే రావు అనే వార్త.. చాలా మంది యువతని ఆందోళనకు, ఆవేదనకు గురిచేయనుంది.




వేగుచుక్క న్యూస్: టీఎన్జిఓస్ రూపొందించిన డైరీ, క్యాలెండర్ ను బుధవారం నగరంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 8**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సైబర్ విభాగం ఏసిపి వెంకటేశ్వర్ రావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం కలెక్టరేట్లోని వివిధ శాఖల అధికారులకు, ఉద్యోగులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న సైబర్ మోసాల గురించి ఈ సందర్భంగా ఏ సీ పీ వెంకటేశ్వరరావు ప్రస్తావిస్తూ, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ప్రజల అమాయకత్వం, అజాగ్రత్తను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఆర్థిక పరమైన మోసాలకు పాల్పడుతుంటారని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికి కూడా ఓటిపి నెంబర్ వెల్లడించకూడదని సూచించారు. బ్యాంకులు ఫోన్ ద్వారా ఓటిపి అడగవని అన్నారు. పోలీసుల పేరిట, కస్టమ్ అధికారుల పేరుతో కూడా ఇటీవలి కాలంలో ఫోన్ కాల్స్ చేస్తూ, కేసుల పేరిట భయభ్రాంతులకు గురి చేస్తూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా సైట్ల ద్వారా కొందరు యువతులు పరిచయం అయ్యి మాయమాటలతో మభ్యపెట్టి మోసాలకు గురి చేస్తుంటారని అన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక



పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్ల ఆచూకీ తెలుసుకొని వారిని కట్టడి చేసేందుకు పోలీస్ శాఖ సైబర్ విభాగం ద్వారా కృషి చేస్తోందని అన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు ఏమాత్రం సంకోచించకుండా వెంటనే సైబర్ విభాగంను సంప్రదిస్తే మోసగాళ్లను గుర్తించేందకు ఎక్కువ అవకాశంఉంటుందన్నారు. అయితే సైబర్ నేరాల పట్ల కనీస అవగాహన ఏర్పరచుకుని అప్రమత్తంగా ఉంటే మోసాలకు ఆస్కారం ఉండదని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయాగౌడ్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు,
వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల ప్రారంభనికి కృషి.

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 8:**

ఇందూర్ నగరం : అహ్మది బజార్, ఖలీల్ వాడిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ దిలీప్ కుమార్ తో కలిసి బుధవారం సందర్శించారు.

ఈ సందర్బంగా ఎమ్మెల్యే గ మాట్లాడుతు, అహ్మది బజార్ లో 9 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు పూర్తి అయ్యి దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్న ప్రారంభం కాకపోవడం తో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. 97 షాటర్స్ తో నిర్మాణం అయినా మార్కెట్ నాన్ వెజ్ కు 38,జనరల్ కు 59 చొప్పున విధివిధానాలకు లోబడి కేటాయింపులు జరుగుతాయి అని ప్రజలకు త్వరలో అందుబాటులోకి వచ్చేల చర్యలు తీసుకుంటాం అన్నారు.

ఖలీల్ వాడిలోని మల్టీపుల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు 4.50 కోట్ల వ్యయంతో దాదాపు పూర్తి కావడం జరిగిందని అన్నారు మిగిలిన పనులకు 1.50 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు త్వరలో పనులు పూర్తి చేసేల చర్యలు తీసుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం అన్నారు.మల్టీపుల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో నాన్ వెజ్ 32,ఫ్లవర్ ,ఫ్రూట్స్ 16,వెజ్ 64 స్టాల్స్ ను మున్సిపల్ విధివిధానాలకు లోబడి కేటాయింపులు జరుగుతాయి అని అన్నారు. మార్కెట్ల ప్రారంభం ఆలస్యనికి గల కారణాలు కమీషనర్ గారిని అడిగి తెలుసుకున్నారు, చట్టపరమైన విధివిధానాలు పూర్తి చేసి అతి త్వరలో మార్కెట్ ప్రారంభనికి కృషి చేయాలనీ సూచించారు.



ప్రజా ఆరోగ్యం, అవసరలకు అనుగుణంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను త్వరలో ప్రారంభించేల కృషి చేస్తానని దీనికి అందరు సహకరించాలని కోరారు, నిజామాబాదు కార్పొరేషన్ ను తెలంగాణలో ఆదర్శవంతంగా మొదటి స్థానంలో నిలపడేలా కృషి చేయాలన్నారు దీనికి నగర ప్రజలందరు

# ఈనెల 10 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు బంద్..!?

తెలంగాణలో ఈ నెల 10వ తారీఖు నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోనున్నట్టు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇందుకు కారణం.. నెట్ వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వానికి పెట్టిన డెడ్‌లైన్. గత ప్రభుత్వం నుంచి వస్తున్న పెండింగ్ బకాయిలు ఇప్పటివరకు చెల్లించకపోవటంతో తమకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ నెట్ వర్క్ ఆస్పత్రులు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే.. ప్రభుత్వానికి నెట్ వర్క్ ఆస్పత్రులు పదో తారీఖును డెడ్ లైన్‌గా విధించటం గమనార్హం.

తెలంగాణలో ఈ నెల 10వ తేదీ నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేయనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు నెట్‌వర్క్ ఆస్పత్రులు డెడ్‌లైన్ విధించాయి. ఏడాది కాలంగా పెండింగ్ బకాయిలు చెల్లించలేదని ఆరోపించిన నెట్ వర్క్ హాస్పిటల్స్.. 10వ తేదీని డెడ్ లైన్‌గా విధించటం గమనార్హం. బకాయిలు పెండింగ్ పెట్టటం వల్ల తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని.. ఆస్పత్రి యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ. 675 కోట్లు బకాయిలు చెల్లించలేదని ఆస్పత్రులు తెలిపాయి.

ఇదిలా ఉంటే.. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఒకటైన ఆరోగ్య శ్రీ పరిధి పెంపు హామీని అన్నింటి కంటే ముందే అమలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వేళ.. ప్రజలకు ఆరోగ్యశ్రీ కింద వైద్య ఖర్చుల పరిధిని




10 లక్షల రూపాయలకు పెంచుతూ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అమలులోకి వచ్చింది. అంతేకాకుండా.. ఇందులో ఇప్పటికే ఉన్న పలు వైద్యాలతో పాటు మరికొన్ని వైద్యాలను కూడా ప్రభుత్వం చేర్చింది.

దీంతో.. నిరుపేదలు తమ అనారోగ్య సమస్యలకు ఆరోగ్య శ్రీ కింద నాణ్యమైన వైద్యసేవలు పొందుతున్నారు. ఫలితంగా.. నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ లబ్ధిదారుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుండటం.. వారి వైద్య సేవలు అందించి అందుకు సంబంధించిన ఖర్చును ప్రభుత్వాని కి పంపిస్తోంది. అయితే.. ఆస్పత్రు లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నప్పటికీ.. గత ప్రభుత్వం నుంచి వస్తున్న కొన్ని పెండింగ్ బకాయిలు అలాగే కొనసాగుతుం డటం గమనార్హం. వాటిని వెంటనే క్లియర్ చేయాలం టూ నెట్ వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వా నికి డెడ్ లైన్ విధించాయి. మరి నెట్ వర్క్ ఆస్పత్రులు విధించిన పదో తారీఖు లోపల పెండింగ్ బకాయిలు చెల్లించక పోతే.. నిజంగానే ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోతా యా.. లేకపోతే ప్రభుత్వం ఏదైనా పరిష్కారం ఆలోచిస్తుందా.. లేదా బకాయిలు చెల్లించి ఆస్పత్రుల కు ఉపశమనం కలిగిస్తుందా చూడాల్సి ఉంది.